ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (భుజబలపట్నంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 28-10-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏపని చేస్తున్నా జ్ఞానమును లక్ష్యముగా పెట్టుకొని పనిచేయాలి. సమాజపరంగా పనిచేసినా, పారమార్థికంగా పనిచేసిన లక్ష్యం జ్ఞానసముపార్జనమీద ఉండాలి. ముందు భక్తి, జ్ఞానము తరువాత మిగిలిన విషయములు. ముందు ఈశ్వరుడు తరువాత లోకం అలాగ ఉండాలి. మన హృదయంలో ఒక నిజం ఉంది. అతి శాంతముగా ఉంటుంది, ఆనందముగా ఉంటుంది, సుఖంగా ఉంటుంది. నీ మనస్సును అంతర్ముఖం చేసి నీ హృదయంలో ఉన్న నిజాన్ని పట్టుకోమని మహాత్ములు, పెద్దలు చెపుతున్నారు. అంతర్దృష్టి ముఖ్యం. స్వప్నంలో వచ్చిన గొడవలు మెలుకువ వచ్చినతరువాత స్వప్నం అణిగిపోయినపుడు ఆ గొడవలు అన్నీ ఎలాగ అణిగిపోతున్నాయో అదేవిధంగా నీ హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి వచ్చినపుడు వేలాది జన్మల గొడవలు అన్నీ చల్లారిపోతాయి.

ఉన్నది ఒక్కటే వస్తువు. మనకు వేరువేరుగా, బేధం బేధంగా కనిపిస్తోంది. మనస్సే బేధం సృష్టిస్తోంది ఎందుచేతనంటే దానికి భోగం కావాలి. బేధం సృష్టించకపోతే దానికి భోగం ఎలా వస్తుంది. భోగం రాదు. అందువలన బేధం సృష్టించి దానివలన భోగిస్తోంది. అసలు వస్తువులో బేధం లేదు. కాని మనస్సు బేధాన్ని సృష్టిస్తోంది. మనస్సు నశిస్తే అది సృష్టించిన బేధంకూడా నశిస్తుంది. మనకు సదాచారం ఉండాలి, సాత్విక ఆహారం తీసుకోవాలి. ఆహారం శుద్ధిగా ఉండాలి. ఆహారం శుదిగా ఉంటే అంతఃకరణం శుది అవుతుంది. నానాగడ్డి తిని హరేరామ, హరేకృష్ణ అని భజన చేస్తే లాభం లేదు. ఎవడి మనస్సు అయితే శుద్ది అయిందో వాడికి భక్తిని సంపాదించాలి అనే బుద్ధి కలుగుతుందిగాని అందరికి కలుగదు. మనస్సు ఎప్పుడయితే బాగుపడిందో, సంస్కరింపబడిందో అప్పుడు అది అంతర్ముఖం అవుతుంది. ఎప్పుడయితే అంతర్ముఖం అయిందో అప్పుడు దానికి నిత్యమైన ఆనందం దొరుకుతుంది. ఆత్మానందం నిత్యంగా ఉంటుంది, శాశ్వతంగా ఉంటుంది. ఎర్రచీమ పంచదారలోనుండి ఏవిధంగా బయటకు రాదో అదేవిధంగా ఆ ఆనందములోనుండి మనం బయటకు రాలేము.

ఇతరులను దూషించటం, పీడించటం మంచిది కాదు. దీనివలన రజోగుణం పెరుగుతుంది. మీరు సుఖంగా, శాంతిగా జీవిస్తూ ఇతరులను పీడించకుండా చేతనయితే సహాయం చేస్తూ జీవిస్తూ ఉంటే రజోగుణం తగ్గుతుంది. కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః అని స్వామివారు గీతలో చెప్పారు. మాటమాటకి ఉద్రేకపడటంవలన రజోగుణం పెరుగుతుంది. దీనివలన కోపం, కామం పెరుగుతుంది. ఈ కామక్రోధాలు మనస్సుకు, దేహానికి, ఇంద్రియాలకు సంబంధించినవి కాని నీలోపలఉన్న సత్యమునకు వీటితో సంబంధంలేదు. మనం మనంగా ఉండనంతకాలం మనం స్వాతంత్ర్యముగా ఉండలేము. అంటే ఈ కామక్రోధములు ఎటు గంతువేయమంటే అటు గంతు వేస్తాము. దేహబుద్ది పెరిగేకొలది కామక్రోధములు పెరుగుతూ ఉంటాయి. బాహ్యామైన సంఘటనలకు రియాక్టు అయినపుడు, బాహ్యామైన శరీరాలను చూసినపుడు కామక్రోధములు వస్తున్నాయి. అవి నీ స్వరూపంలో లేవు. నీకు గాఢనిద్రలో ఈ కామక్రోధములు లేవు. ఇవి సృష్టికి సంబంధించిన విషయాలు. నీవు వాటితో కలసిపోయి అవే నువ్వు అనుకొంటున్నావు. తక్కువగా మాట్లాడు, ఎక్కువగా విను దానివలన లాభం పొందుతావు అని చెపుతారు. నీమాట, నీ ఆలోచన నీవు బాగుపడటానికి ఉపయోగపడాలి. ఇవిఅన్నీ వ్యవహారిక గొడవలుఅయినప్పటికీ తత్వం తెలుసుకోవటానికి

ఇవి సహకరిస్తాయి. కామక్రోధములను సంతృప్తిపరస్తూఉంటే అవి పెరుగుతూ ఉంటాయి. సంతృప్తిపరస్తూ వాటిని జయించలేరు. కామక్రోధములను అరికటకపోతే అవి పెరిగిపోతూ ఉంటాయి, నీ మనస్సును బాహ్యాముఖం చేస్తాయి, నీకు వికృత రూపం కలిగిస్తాయి. మీ ఇంటోవారు, బయట ఉన్నవారు నీకు శత్రువులు కాదు. ఈ కామక్రోధములే నీకు శత్రువులు అన్న విషయం నీకు అర్థమవ్వాలి.

ఇంద్రియాలకు నిగ్రహం రావాలి, మనస్సుకు చాపల్యం ఆగాలి, బుద్ధికి ఏకాగ్రత కావాలి. ఇవి వస్తే నువ్వు జ్ఞానం సంపాదించటానికి పునాది వేసుకున్నట్టు లెక్క. నీవు ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలంటే ఈ పునాది అవసరం. నీదేహం చనిపోయేవరకూ సాధన విడిచిపెట్టకూడదు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నీ గమ్యమును మర్చిపోవద్దు. నీవు పొందవలసిన వస్తువును మర్చిపోవద్దు. నువ్వు రోజూ అన్నం తినటం మర్చిపోతున్నావా, మర్చిపోవటం లేదు. అలాగే నీవు ఏదైతే పొందాలనుకొంటున్నావో దానిని మర్చిపోవద్దు. దానిని మర్చిపోతే వచ్చే తిప్పలు ఎలా ఉంటాయో ఇక్కడ ఆచార్యులవారు చెపుతున్నారు. మీ చేతిలో ఉన్న బంతి జారిపోయింది అనుకోండి. అది ఇక్కడ ఉండదు. పల్లం ఎక్కడ ఉంది ఎక్కడ ఉంది ఇంకా పల్లం ఎక్కడ ఉంది అని వెతుక్కొంటూ ఆ పల్లంలోనికి వెళ్ళిపోతుందిగాని పడినచోట ఆ బంతి ఉండదు. నీవు గమ్యమును ఎప్పుడైతే మర్చిపోయావో చేతిలోనుండి జారిన బంతి పల్లానికి ఎలా వెళ్ళిపోతుందో అలాగ నువ్వు ఆజన్మకు ఆజన్మ అధోగతి అయిపోతావు. ఎక్కడికి పోతావో నీకే తెలియదు. లక్ష్యాన్ని మర్చిపోయినపుడు నీవు ఆ జన్మకు ఆజన్మ పతనమవుతావు. పూర్తిగా పతనమయ్యేవరకూ నీ ప్రయాణం ఆగదు.

లోకవిషయాలను చింతిస్తూఉంటే అహంకారం పెరుగుతూ ఉంటుంది. భగవంతుని చింతిస్తూఉంటే అహంకారం తగ్గుతూ ఉంటుంది. సూర్యుడు అందరికీ సమానంగా వెలుతురు ఇస్తున్నాడు. కాని ఎవడి స్వభావాన్నిబట్టి వాడు ఆ వెలుతురులో నడుచుకొంటాడు. వర్షం అన్ని మొక్కలమీద కురుస్తుంది. కాని ఆ బీజాన్నిబట్టి బత్తాయిచెట్టు బత్తాయికాయలు, నారింజచెట్టు నారింజకాయలు, సపోటాచెట్టు సపోటాకాయలు కాస్తుందిగాని అన్నిమొక్కలు ఒకేకాయలు కాయవు. అదేవిధంగా భగవంతుడు అందరికీ సమానమైన అవకాశములు ఇస్తున్నప్పటికీ ఎవరి సంస్కారాన్నిబట్టి వారు పనిచేస్తున్నారు. అందుచేత ఈశ్వరుడి పొరపాటు ఏమిలేదు. మీ పుణ్యాపాపములతో భగవంతునికి ఎట్టి సంబంధం లేదు. ఈశ్వరుని ప్రీతికోసం పనిచేస్తే మనకు ఎటువంటి బుద్ధిని ఇస్తే మనకు జ్ఞానం కలుగుతుందో అటువంటి బుద్ధిని ఆయన ఇస్తాడు. మనవలన ఏదో అవుతుంది అని మనం అనుకొంటాము. మనవలన ఏమీ అవ్వదు. అంతా ఈశ్వర సంకల్పంవలన జరుగుతోంది. ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధమునసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును. జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు, ఇది నిశ్చయం. రమణమహర్షిగారు చెప్పిన మొదటి ఉపదేశం ఇది. మనం జీవితం పొడుగునా కృషిచేసి ఈ ఒక్కవాక్యం అర్థంచేసుకొంటే సరిపోతుంది. ఇది అర్థమయితే నీ దుఃఖం నశిస్తుంది, సుఖం తెలుస్తుంది.

విషయాలను ధ్యానించేవాడికి, విషయాలను స్మరించేవాడికి ఆ విషయాలను భోగించాలి అనేబుద్ధి కలుగుతుంది. విషయాలను చింతించకుండా ఆత్మను చింతిస్తూ ఉంటే మనస్సు అంతర్ముఖం అవుతుంది. యోగబుద్ధి కలుగుతుంది. అంటే యోగివి అవుతావు. ముందు విషయాన్ని స్మరిస్తావు. విషయాన్ని స్మరించాక అది నీకు కావాలి అనిపిస్తుంది. కాని విషయాన్ని నీమనస్సులో అనుకోకుండా అది నీకు కావాలని అనిపించదు. భోగబుద్ధి ఎప్పుడయితే కలిగిందో బాగా సంపాదించాలనే బుద్ధి పెరుగుతుంది. కళ్ళతో చూసినది ప్రతీదీ కావాలనిపిస్తుంది. చూచేవాడు జీవుడు. చూడబడేది ప్రకృతి. జీవుడు ఇంద్రియాలద్వారా లోకాన్ని చూస్తున్నాడు. ఆ జీవుడు ఎంతకాలం ఉంటాడో అంతకాలం మనకు జన్మలు వచ్చేస్తాయి. దేహం చనిపోయినపుడు మనస్సు నశించదు. మనస్సు అలాగే ఉంటుంది. మనస్సుకు దేహం కావాలి కాబట్టి మరల జన్మవస్తుంది. హృదయంలోనుండి మనస్సు, మనస్సునుబట్టి దేహం, దేహమునుబట్టి లోకం వస్తుంది.

దేహం లేనివాడికి లోకం లేదు. మనస్సు లేనివాడికి దేహం లేదు. హృదయం తెలిసినవాడికి మనస్సు లేదు. నీలో జీవలక్షణాలు ఉన్నంతకాలం జన్మలు వస్తూ ఉంటాయి.

నేను ఎవడను అంటే ఈ జీవుడు ఎవడు అని. ఆ జీవుడు ఉంటేనే భక్తి, ఆ జీవుడు ఉంటేనే పూజ, జపం. ఆ జీవుడు లేకపోతే పూజ, జపం ఎవరికి? జీవలక్షణాలు ఉన్నవాడికి సాధనగాని జీవలక్షణాలు లేనివాడికి సాధనతో పని ఏముంది. ఓ రామా! శ్రీరామా! అజన్మ దుర్విషయ రహితునకు జపమేల తపమేల అన్నాడు త్యాగరాజు. కొంతమందికి పొగడ్తలుఅంటే ఇష్టం. అది ఒకరకమైన భోగదృష్టి లక్షణం. భోగబుద్ధి ఉన్నంతకాలం ప్రకృతి ప్రవాహంలో కొట్టుకొనిపోతావు, నీ స్వరూపానికి దూరమవుతావు. నిన్ను రక్షించేవాడు కనబడడు. పుస్తకాలవలన జ్ఞానం వస్తే అందరూ జ్ఞానులు అయిపోదురు. సద్గురువుల అనుగ్రహంవలన నీకు జ్ఞానం వస్తుందిగాని పుస్తకాలవలన జ్ఞానం రాదు.

రూపాలు, నామాలు, రంగులు, గుణాలు వేరైనా అందరి హృదయంలోఉన్న తత్వం ఒక్కటే. ఒక్కటిగా ఉన్న ఆ తత్వమును ఎవడైతే గ్రహించాడో వాడే తరిస్తాడు. వాడు భగవంతునిలో ఐక్యమవుతాడు. రంగులు, గుణాలు, రూపాలు వేరువేరుగా ఉండవచ్చు. ఆ ప్రవాహంలో కొట్టుకొనిపోవద్దు. మీ ఇంట్లో ఉన్న వ్యక్తుల శరీరాలను మీరు రోజూ చూస్తూ ఉంటారు. ఆ శరీరాలను చూసినపుడు మీ శరీరం వేరు, ఆ శరీరాలు వేరు అని మీకు తెలుస్తూ ఉంటుంది. అది మీభర్త శరీరం అయినా, మీ మనవడు శరీరం అయినా ఆ శరీరంమీది కాదు అని ఎంతస్పష్టంగా మీకు తెలుస్తుందో మీ శరీరంకూడా మీది కాదని అంతస్పష్టంగా ఎప్పుడు మీకు తెలిసిందో ఆ జన్మలో మీకు మోక్షంవస్తుంది. భగవాన్‌కు శరీరం ఉంది మనకీ శరీరం ఉంది. ఆయనకు మనకు తేడా ఏమిటి అంటే నేను వేసుకున్న చొక్కా నాకు ఎలాగ అనిపిస్తోందో ఆయన శరీరం ఆయనకు అలాగ అనిపిస్తుంది. చొక్కానాదేగాని చొక్కానేనుకాదు అని నాకు స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. జ్ఞానికి దేహం ఉంటుంది. ఆదేహం వాడిదేఅని మనం అనుకొంటాము, ఆదేహం నాది అనివాడు అనుకొన్నప్పటికీ దేహము నేనుకాదుఅన్న సంగతి వాడికి స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. నీవు అజాగ్రత్తగా ఉంటే పతనమవుతావు. మీరు అనుకొన్నది సాధించటానికి ఎంతో జాగ్రత్తగా ఉండి దానికోసం ఎన్నోరకాలుగా ప్రయత్నాలు చేస్తారు. అలాగే మీరు ఏదైతే పొందాలనుకొంటున్నారో దానిమీద మీదృష్టి, శ్రద్ధ, ఏకాగ్రత ఉండాలి. మీరు ఏపని చేస్తున్నప్పటికీ మీ మనస్సు దానిమీద ఉండాలి. అశ్రద్ధ పనికిరాదు. శ్రద్ధవలన జ్ఞానం కలుగుతుంది. ఆధ్యాత్మిక మార్గంలో నీకు తెలివి, సమర్థత, వివేకం, ఏకాగ్రత ఇవి అన్నీ ఉండాలి. నీ ముక్కులోగాలి తిరుగుతుండగా భగవంతుని తెలుసుకోవటానికి సాధన చెయ్యటంలేదు అనుకో నీవు చనిపోయినవాడితో సమానము అంటున్నారు. మీరు కూర్చున్నా, నడుస్తున్నా, తింటున్నా ఏపనిచేస్తున్నా మీ దృష్టిఅంతా భగవంతునిమీద ఉండాలి. బ్రహ్మమును పొందాలి అనేకాంక్ష బలీయంగా ఉండాలి. అజాగ్రత్త పనికిరాదు. దేనినైతే పొందాలి అనుకొంటున్నారో దాని చింతనే ఉండాలి, దానిగురించి వినాలి, దానినే చూస్తూ, స్మరిస్తూ ఉండాలి. దేవుడిని పూజగదికే పరిమితం చేయవద్దు. నీదేహం ఎక్కడ ఉన్నా నీదృష్టిమాత్రం భగవంతునిమీద ఉండాలి. భగవంతుని స్మరణలో ఉండాలి. స్మరణ సహజంగా ఉండాలి. దానిని సహజయోగం అంటారు. దానివలన భగవంతుడు లభిస్తాడు. భగవంతుడు దొరకటం తేలిక అవుతుంది. ఈశ్వరుడితో మానసిక సంబంధంపెట్టుకొంటే నిజయం వాయిదాలు పడదు. ఎప్పుడో కాదు ఇప్పుడే తొందరగా జయాన్ని పొందుతావు. ఆలస్యం చేయకుండా ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు.

ఈ దేహాలు చూసి మీరు మురిసిపోవద్దు. మీ దేహం అందంగా ఉండవచ్చు. మీకు ధనం ఉండవచ్చు, విద్య ఉండవచ్చు. వీటినిచూసి మురిసిపోవద్దు. ఈదేహం ఎంతనిజమో ఆ గొడవలుకూడా అంతే నిజం. ఈ దేహం ఈరోజు కనిపిస్తోంది. రేపు ఏమౌతుందో చెప్పలేము. దీనిగురించా మీరు ఆలోచించవలసింది లేకపోతే మీ హృదయంలో ఉన్న చావులేని నిజం గురించా మీరు ఆలోచించవలసింది. జాగ్రత్తగా నిర్ణయించుకోండి. అజాగ్రత్త పనికిరాదు. ఎంతదూరం చెప్పాలో అంతవరకు తీసుకొనివెళ్ళి చెపుతున్నారు. క్షణభంగురమైన దేహమును చూసి మురిసిపోవద్దు. నీ హృదయంలోఉన్న చావులేని వస్తువును తెలుసుకోవటానికి

ప్రయత్నం చెయ్యి. ఒక్కక్షణంకూడా అజాగ్రత్తగా ఉండవద్దు. నీ స్వరూపంలోనుండి జారిపోతే, భగవంతునిలోనుండి వేరుపడిపోతే నీకు అధోగతి తప్పదు. దేహం చనిపోయినతరువాత మరల కొత్తదేహం వచ్చేవరకూ సాధన చేయటానికి అవకాశం ఉండదు. పరమలోభివాడు డబ్బును ఎంత జాగ్రత్తగా పెట్టుకొంటాడో అలాగే భగవంతుడు నీ అలవాట్లను జాగ్రత్తపెట్టిఉంచి మరల జన్మలో నీకు అప్పగిస్తాడు. బాగా పతనం అయిన తరువాత దేవుని తెలుకోవాలనే కాంక్ష నీకు వచ్చినా తెలుసుకొనే అవకాశం ఉండకపోవచ్చు. అందుచేత బహుజాగ్రత్తగా ఉండండి. మీరు కష్టపడి సాధించినది మీకు ఉంటుందిగాని చనిపోయిన తరువాత ఏమీరాదు. ఈ దేహంలో ఉండగా ఎంత స్వేచ్ఛను సంపాదించుకొన్నారో, భగవంతునికి ఎంత దగ్గరగా చేరుకొన్నారో, ఎంత పక్వానికి వచ్చారో శరీరం చనిపోయిన తరువాత ఆ స్థితే కొనసాగుతుందిగాని అదనంగా ఏమీ రాదు. దేహం ఉండగా మోక్షం రాదు అనుకోండి దేహం పోయిన తరువాత మోక్షం వస్తుందని కనిపెట్టుకొని ఉండకండి. ఈ శరీరంలో ఉండగా స్వేచ్ఛ ఎలా ఉంటుంది, శాంతి ఎలా ఉంటుంది అని తెలియనపుడు శరీరం పోయిన తరువాత శాంతి, స్వేచ్ఛను ఎందుకు ఆశిస్తావు, ఆశిస్తేమటుకు ఎలా వస్తాయి, రావు. నీవు పొందవలసింది ఇప్పుడే ఇక్కడే పొందాలి. ఇప్పుడు పొందితే శరీరం పోయిన తరువాతకూడా ఆస్థితి కంటిన్యూ అవుతుంది. శరీరం పోయిన తరువాత అదనంగా ఏమీ రాదు. గ్రేస్ మార్కులకోసం కనిపెట్టుకొని ఉండవద్దు. ఓ ముముక్షువులారా! నేను మీకు ఉపదేశించేది ఏమిటి అంటే ఈ దేహంలో ఉండగానే మీరు మోక్షమును పొందటానికి ప్రయత్నం చేయండి దేహం పోయిన తరువాత ప్రయత్నం చేయటానికి అవకాశం లేదు అని ఆచార్యులవారు చెపుతున్నారు.

భేదబుద్ధిని పోగొట్టుకోవటానికి సాధనచేసి భగవంతునికి దగ్గరగా వచ్చావు అనుకో భేదబుద్ధి పూర్తిగా నశించకుండా ఏమాత్రం భేదబుద్ధి ఉన్నా పునర్జన్మ రావటం ఖాయం. భేదబుద్ధి పూర్తిగా నశిస్తేగాని మోక్షానుభవం కలుగదు. ఈభేదబుద్ధిని నశింపచేసుకోమని ఎంతోమంది మహాత్ములు చెపుతున్నప్పటికీ దానినుండి బయటపడటానికి మీరు ప్రయత్నం చేయటంలేదు. భేదబుద్ధిని నశింపజేసుకోవాలి అనే తలంపుకూడా మీకు రావటంలేదు. మీకు నిజం తెలియకపోవచ్చు. కాని నిజంకానిదానిని నిజం అని గాఢంగా నమ్మి కూర్చున్నారు. ఏనేను అయితే సత్యంకాదో ఆనేనును నిజంఅని హృదయపూర్వకంగా నమ్మికూర్చున్నారు. ఈ నమ్మకంలోనుండి, మూర్ఖత్వంలోనుండి ఎవరు మిమ్మల్ని బయటకు తీసుకొనివస్తారు. సత్యంకానిదానిని సత్యంఅని నమ్మినంతకాలం కష్టాలు, బాధలు, సుఖాలు, జన్మలు మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాయి. ఇవి అన్నీ తప్పవు. రిపీటెడ్‌గా వస్తూ ఉంటాయి. ఈ ప్రవాహమును ఎవరూ ఆపలేరు. ఒక్క గురువుతప్పించి ఎవరూ మిమ్మల్ని ఇందులోనుండి బయటకు తీసుకొని రాలేరు. మీరు ఎన్ని సాదనలు చేసినా గురువు అనుగ్రహం లేకుండా మీకు జ్ఞానం కలుగదు. మీరు రోజూవంట చేసుకొంటున్నారు. మీ పనులు రోజూ చేసుకొంటున్నారు. ఎవరైనా వచ్చి చేస్తారని ఎదురుచూస్తున్నారా, లేదు మీరే చేసుకొంటున్నారు. అలాగే మీ సాధన మీరే చేసుకొని మోక్షాన్ని పొందండి. ఎవరికోసం కనిపెట్టుకొని ఉండవద్దు. మీరు సాధన చేసుకొంటే మీకు మీరే బంధువులు. బయట బంధువులు బంధించేవారేగాని తరింపచేసేవారు కాదు. మీరు సాధనచేసుకొని మీ హృదయంలో ఉన్న దేవుని గ్రహించండి. మీరు కృషిచేయండి కృప దానంతట అదే వస్తుంది. మిమ్మల్ని మీరు బాగుచేసుకోండి. దొంగతనం చేసినవాడిని పోలీసులు, ఆ ఇంటిలోనివారు తరుముతూ ఉంటారు. వాడు బయటపడి పారిపోతాడు. ఎందుచేత దొంగతనం చేసానని వాడికి తెలుసు. వాడు పోలీసులకు దొరకడు అనుకోండి చివరకు యమధర్మరాజుకు దొరుకుతాడు. నీవు అజ్ఞానంలో ఉన్నంతకాలం నిన్ను జన్మలు వెంటాడుతూ ఉంటాయి. నీ హృదయంలో ఉన్న భగవంతుని గ్రహించేవరకూ నిన్ను కష్టాలు, నష్టాలు, దుఃఖం భారాలు తిరిగి తిరిగి నిన్ను వెంటాడుతూనే ఉంటాయి. ఈ జన్మలోఉన్న దుఃఖం వచ్చేజన్మలో రాకపోవచ్చు, ఇంకో దుఃఖం రావచ్చు. నీ హృదయంలో ఉన్న భగవంతుడు నీకు వ్యక్తమయ్యేవరకూ ఏదోరకమైన దుఃఖం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. భేదబుద్ధి నశిస్తేగాని నీ హృదయంలో ఉన్న భగవంతుడు నీకు వ్యక్తంకాడు.